## క్లుప్తంగా

### విత్తనాల పంపిణీ



పెదవలస రైతు భరోసా కేంద్రంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస రైతుభరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రాయితీ విత్తనాలను సద్వినియోగం రైతులు చేసుకోవాలని ఆర్‌బీకే సిబ్బంది కోరారు. పంటల సాగులో సూచనలు, సలహాల కోసం వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

### మాతృ భాషాభివృద్ధికి కృషి

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన సంఘం భవనంలో మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో మాతృ భాష ఉపాధ్యాయుల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా సోమేలి నాగేంద్ర, కార్యదర్శిగా కుమిడి రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా , 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాతృ భాషాభివృద్ధికి కృషి చేయాలన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

### ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ బోయిన కుమారి

గూడెంకొత్తవీధి: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీపీ బోయిన కుమారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం ద్వారా ఆధార్ కార్డులోని వివరాల్లో మార్పు, చేర్పులతో పాటు కొత్త కార్డుల జారీ ప్రక్రియ తదితర సేవలందిస్తున్నట్టు చెప్పారు. ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డు సభ్యులు బాలన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### దోమల నివారణ మందు పిచికారీ



వై.రామవరంలో దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో మంగళవారం నుంచి 2వ విడత దోమలమందు పిచికారీ ప్రారంభించారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ దినేష్, నరేంద్రల పర్యవేక్షణలో మలేరియా టెక్నీషియన్ పల్లాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వై.రామవరంలోని పలు వీధుల్లో దోమల మందు పిచికారీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ పరిధిలో మలేరియా కేసులు ఎక్కువగా ఉన్న సమస్యాత్మక గ్రామాల్లో రెండవ విడత పిచకారీ చేయిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా భైరవ బాధ్యతల స్వీకరణ



మాజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ భైరవ

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి.ఆర్.భైరవ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాజస్థాన్ రాష్ట్రం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇదే పాఠశాల ఆవరణలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీపాద రామకృష్ణ నియమితులయ్యారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

# జ్వరాల కాలం.. వచ్చేసింది

- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం
- ముందస్తు చర్యలు చేపట్టని ప్రభుత్వం
- విజృంభిస్తున్న విషజ్వరాలు



జెడ్పీ కాలనీలో పేరుకుపోయిన చెత్త

అరకులోయ రూరల్: వాతావరణం మార్పులతో గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో గిరి గ్రామాల్లో డ్రైనేజీలు, కల్వర్టులు, ప్రధాన రహదారుల్లో చెత్త చెదారాలు పేరుకుపోయాయి. ఈగలు, దోమలు ప్రబలుతున్నాయి. గ్రామల్లో పలు ప్రాంతాలను అధ్వానంగా మారాయి. అరకులోయ నియోజకవర్గంలో ఆరు మండలాల పరిధిలో ఉన్న 130 గ్రామ పంచాయతీలు, సుమారు 1500 గ్రామాల్లో నేటికి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా ఎటువంటి పారిశుధ్య కార్యక్రమలు చేపట్టలేదు. దీంతో సీజనల్ వ్యాధుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రాణాలమీదకు తెచుకోవాల్సిన పరిస్థితి తప్పడం లేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కొరవడిన క్లోరినేషన్**

ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో అంతంత మాత్రమే వైద్యం సౌకర్యాలు అందిస్తున్నారు.పేరుకేయ రాష్ట్ర ప్రభుత్వం సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకల మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉందని చెప్పుతున్న ఆచరణలో మాత్రం నిర్వహించడం లేదు. అన్ని గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్, ఫాగింగ్ తదితర పనులను చేయడం లేదని పలువురు చెబుతున్నారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆరు మండలాలో గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రహదారులు, డ్రైనేజీలు, ప్రధాన కేంద్రాలు, పలు లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. దోమలు, ఈగలు ప్రబలుతుండడంతో వ్యాధులు ప్రబలుతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని చెబుతున్నారు.



ఏరియా ఆస్పత్రి సమీపంలోని చెత్త కుప్పలు

**ముందుస్తు జాగ్రత్తలు**

రోగాలు వచ్చాక బాధపడడం కంటే , ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు వ్యాధులను నియంత్రించవచ్చని చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యం క్షీణించడానికి దోమలే ప్రధాన కారణమంటున్నారు. వీటి వల్ల డెంగీ, మెదడువాపు, చికున్‌గున్యా,వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా చెబుతున్నారు. ఇంటి పరిసరాల అపరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు ఉంటే దోమలు పెరిగి వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. దోమల వల్ల ప్రబలే కొన్ని వ్యాధుల లక్షణాలు..

**డెంగీ జ్వరం**

అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు , నొప్పులతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం తగ్గినట్టు తగ్గి , వారం , పది రోజులు ఉంటుంది. ఏడీఎస్ దోమ వల్ల వచ్చే ఈ జ్వరం ఒకరి నుంచి మరొకరికి వస్తుంది. కీళ్లనొప్పి, శరీరంపై దద్దుర్లు రావడం ఈ జ్వరం లక్షణాలు. అలాగే ముక్కు మలం ద్వారా రక్తం వచ్చే అవకాశం ఉంది.

**మలేరియా**

తీవ్రమైన జ్వరం, చలితో వణుకు ప్రారంభమై నెలల తరబడి బాధిస్తోంది. ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల వ్యాపించే ఈ వ్యాధి వర్షాకాలంలో అధికంగా వస్తుంది. నీరు నిల్వ ఉంటే దోమలు ఉత్పత్తు అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.



సీ-కాలనీలో అధ్వానంగా డ్రైనేజీలు

**సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి**



అందరూ ఎపిడమిక్ సీజన్‌కు అప్రమతంగా ఉండాలి. అవసరమైన జాగ్రత్తలు పాటించాలి, జ్వరాలు , ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీల్లో సిద్ధం చేశాం. అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నాం. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. జ్వరాలపై పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ వర్కర్లు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి.

– డాక్టర్ కమలకుమారి, వైద్యాధికారి, గన్నెల పీహెచ్‌సీ, అరకులోయ మండలం

**కనీస జాగ్రత్తలు**

- వర్షాకాలంలో కాచి చల్లర్చిన నీరు తాగాలి
- ఎప్పటికప్పుడు నీటి పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటిని వినియోగించాలి,
- భోజనానికి ముందుగానే చేతులు కాళ్లు పరిశుభ్రం చేసుకోవాలి,
- వ్యక్తిగత, పరసరాలును పరిశుభ్రతంగా ఉంచుకోవాలి.
- మురుగునీటి ప్రాంతాల్లో కిరోసిన్, నేఫ్తాయిల్ చల్లి దోమల లార్వాను నాశనం చేయాలి.
- ఇంటి కిటికీలకు మెష్‌లు ఏర్పాటుచేసుకోవాలి.
- దోమతెరలు కచ్చితంగా వాడాలి.

### ఎన్‌ఆర్‌ఎస్‌టీసీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

కొయ్యూరు: మండలంలోని ఈదులబంద, పుట్టకోట, గొంధికోట, వై.ఎస్.పాకల, జాజులబంధ గ్రామాల్లో ఎన్ఆర్ఎస్‌టీసీ(నాన్ రెసిడెన్షియల్ స్కూల్ టీచింగ్ సెంటర్)ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు ఎంఈవో జె.రాంబాబు చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పాఠశాలలు లేకపోవడంతో ఎన్ఆర్ఎస్‌టీసీ కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. మంజూరు కాగానే వలంటీర్లను నియమిస్తారన్నారు. ఎక్కడైనా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే అక్కడ శాశ్వ పాఠశాలను ఏర్పాటు చేస్తామన్నారు. రేవళ్లలో పాఠశాల ఏర్పాటుకు విద్యాశాఖ అవసరమైన చర్యలు తీసుకుందని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు.

### 56 మందికి వైద్య పరీక్షలు



బడదనాంపల్లిలోని శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో 56 మంది రోగులకు వైద్య సేవలు అందజేసినట్టు రాజవొమ్మంగి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ తెలిపారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు అవగాహన కల్పించామన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని, కాచి చల్లార్చి, ఒడబోసిన నీటిని తాగాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 104 డీఈఓ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ సంపత్, ఏఎన్ఎం మహేశ్వరి, హెచ్వీ రమాబాయి, ఆశ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగుకు చర్యలు



పినకోటలోని పారిశుధ్యం పనులు చేయిస్తున్న సర్పంచ్ సిరగం గణేష్

అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ కేంద్రంలోని సర్పంచ్ సిరగం గణేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేయించారు. వీధుల్లో మురుగు కాలువలో పూడికతీత, చెత్తాచెదారాలను పారిశుధ్య కార్మికులతో తొలగింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో గిరిజనులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గణేష్ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే సమీపంలోగల ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని చెప్పారు.

## చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వికాష్ బాలరాజు

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ బగ్మారవలసలోని మంగళవారం జరిగిన కార్యక్రమంలో నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వికాష్ బాలరాజు మాట్లాడుతూ పీసా చట్టం అనేది గిరిజనులకు ఆయువుపట్టులాంటిదన్నారు. గిరిజన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, లేనిపక్షంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గ్రామసభల ద్వారా స్థానిక సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. నేచర్ సంస్థ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని, అలాగే డిగ్రీ, పీజీ చదువులకు ఆర్థిక తోడ్పాటునందిస్తున్నామని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ మోస్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**నలుగురికి తీవ్రగాయాలు**



ప్రమాద ప్రదేశంలో అపస్మారక స్థితిలో ఉన్న గంగయ్య

వీఆర్‌పురం: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందగా, ఆశా వర్కర్‌తో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలోని పుసువాగు ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం జీడిగుప్ప పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన ఆశావర్కర్ ఉయికా వెంకమ్మ కాలికి గాయం కావడంతో చికిత్స నిమిత్తం మండల కేంద్రం రేఖపల్లి వెళ్లేందుకు భర్త మల్లయ్య, తన బంధువైన రాయిగుడెంకు చెందిన నూపా గంగయ్య(40)తో కలిసి ద్విచక్రవాహనం పై బయలుదేరింది. కోటారుగొమ్ము గ్రామానికి చెందిన సూట్రు రాజారెడ్డి,సూట్రు దుర్గాప్రసాద్‌రెడ్డి,గణేష్‌లు మరో ద్విచక్రవాహం పై రేఖపల్లి నుంచి స్వగ్రామం కొటారుగొమ్ము వెళుతున్నారు. మార్గం మధ్యంలోని పుసులువాగు వద్ద ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొన్నాయి.ఈ ఘటనలో బైక్ నడుపుతున్న గంగయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆయనతో పాటు తీవ్ర గాయాలైన వెంకమ్మ, దుర్గాప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, గణేష్‌లను 108 వాహనంలో కూనవరం మండలంలోని సీహెచ్‌సీ కేంద్రానికి తరలించారు. గంగయ్య మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని మెరుగైన చికిత్స కోసం భద్రాచలం రిఫర్ చేశారు.గాయపడిన వారిలో దుర్గాప్రసాద్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.



తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న దుర్గాప్రసాద్‌రెడ్డి





తీవ్రంగా గాయపడిన ఆశా వర్కర్ వెంకమ్మ, సూట్రు రాజారెడ్డి

### కట్లపాము హతం



గూడెంకొత్తవీధి: మూలగరువు గ్రామంలో మంగళవారం కట్లపాము హల్‌చల్ చేసింది. అప్పారావు అనే వ్యక్తి ఇంటిలోకి ఈ పాము ప్రవేశించింది. కోడిపిల్లలను తింటుండగా గమనించిన అప్పారావు వెంటనే స్థానికులకు తెలిపాడు. దీంతో వారు పామును హతమార్చారు.

### స్థానిక గిరిజన అధ్యాపకుల నియామకానికి వినతి

మారేడుమిల్లి: ఏకలవ్య పాఠశాల, కళాశాలల్లో ఇతర రాష్ట్రాల అధ్యాపకులను నియమించడంతో విద్యార్థులకు బోధన అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారని వనవాసీ ఎన్‌జీవో డైరెక్టర్ గొర్లె అనుదీప్, మాజీ ఎంపీటీసీ గొర్లె అనిల్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠాల బోధన హిందీలో ఉండడంతో తమ పిల్లలకు అర్థం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్థానిక గిరిజన అధ్యాపకులను నియమించి, తెలుగు భాషలోని పాఠాలు బోధించేలా చూడాలని కోరారు.

## కలెక్టర్ దృష్టికి గ్రామాల్లో సమస్యలు



కలెక్టర్ దినేష్‌కుమార్ వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ సిరగం గణేష్, తదితరులు

అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ పరిధిలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాడేరులోని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి విన్నవించినట్టు సర్పంచ్ సిరగం గణేష్ మంగళవారం తెలిపారు. పంచాయతీలోని చింతపాక నుంచి పెదబురగ, పెదబురగ నుంచి చిందులపాడు, చిందులపాడు నుంచి తట్టపూడి మీదుగా కొట్టంగూడ, రేగలపాలెం నుంచి తముటు వరకు రహదారి నిర్మించాలని కోరామన్నారు. అదే విధంగా గుమ్మంతి నుంచి రాచకీలం మీదుగా రెడ్డిపాలెం , బొర్రాపాలెం నుంచి కర్రిమామిడి మీదుగా పందిరిమామిడి, వీరభద్రపురం నుంచి వలసలగరువు మీదుగా కొత్తబూరుగు సొలబొంగు గ్రామాలకు రోడ్ల నిర్మాణంతో పాటు పినకోట సచివాలయం పీహెచ్‌సీ వరకు డ్రైనేజీ, పంచాయతీ కేంద్రంలోని రెండువేల మీటర్ల సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిలో కోరినట్టు చెప్పారు. దీంతోపాటు పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై విన్నవించామన్నారు.

## స్థానిక సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో ఎంపీపీ రాఘవ, ఎంపీడీవో రంగారావు, తహసీల్దార్ నాగమణి తదితరులు

అడ్డతీగల: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొడ్డపాటి రాఘవ అధ్యక్షతన మంగళవారం జరిగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. ఈ సందర్భంగా గ్రామాల్లో లోటల్టేజీ సమస్య ఉందని, తాగునీటి పథకాలు పాడైతే వెంటనే మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. వీధి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టాలన్నారు. దీనిపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు, ఎంపీడీవో పి.రంగారావు, తహసీల్దార్ పి.నాగమణి, వైస్ ఎంపీపీ కరణం వీరవెంకటరమణ, కో–ఆప్షన్ సభ్యుడు షాబుద్దీన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేక ఇబ్బందులు

కొయ్యూరు: మండలంలోని మూలపేట పంచాయతీ జాజులబందలోని పాఠశాలలో రెగ్యూలర్ ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు మర్రి వెంకటరావు, రాజుబాబు, పి శ్రీను మంగళవారం ఎంఈవో రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది గ్రామస్తుల విరాళంతో పాఠశాల భవనాన్ని నిర్మించామన్నారు. అధికారులు ఆర్ఎస్ఎస్‌టీసీ ద్వారా ఓ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమించగా, ఆయన బదిలీ అయ్యారని, ప్రస్తుతం ఉపాధ్యాయుడు లేరని, విద్యార్థుల చదవు ప్రశ్నార్థకంగా మారిందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎంఈవో రాంబాబు స్పందించి ఎన్ఆర్ఎస్‌టీసీ(నాన్ రెసిడెన్షియల్ స్కూల్ టీచింగ్ సెంటర్) కింద వలంటీర్‌ను నియమిస్తాని, ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో వలంటీర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అనంతగిరి: మండలంలోని వెంకయ్యపాలెం పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించి, 36 మంది విద్యార్థులకు భవిష్యత్తుకు పునాదులు వేయాలని, జెడ్పీటీసీ దీసరి గంగరాజు కోరారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వెంకయ్యపాలెంలోని గతంలోని పాఠశాల ఉండేదని, అయితే విలీనం వల్ల విద్యార్థులు రెండు కిలోమీటర్లు దూరంగా చిలకలగెడ్డకు వెళ్లి, చదువులు సాగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. అరకు–విశాఖ ప్రధాన కావడంతో వాహనాలు రద్దీ కారణంగా విద్యార్థులను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నాన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంకయ్యపాలెంలోని పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించి, స్థానిక విద్యార్థులకు పాఠాలు బోధించేలా చూడాలని కోరారు. దీనిపై కలెక్టర్ దినేష్‌కుమార్, డీఈవో బ్రహ్మాజీరావు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

### 19న జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ఎస్‌బీఐ కార్డ్స్, పేటీఎం, మైటాగ్ ఇండస్ట్రీస్, ముత్తూట్ గ్రూప్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 205 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ప్రొబేషనరీ ఆఫీసర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, టెలీ అకౌంట్స్ అసిస్టెంట్, గ్రాఫిక్ డిజైనర్, టెలీకాలింగ్, ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. 18–45 ఏళ్ల వయసు ఉన్న పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. జీతం నెలకు రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు https://employment.ap.gov. in/ లో పేర్లు నమోదు చేసుకుని.. జాబ్‌మేళాకు హాజరు కావాలని సుబ్బిరెడ్డి కోరారు.

### 19న ఐటీఐలో ఉద్యోగ మేళా

పాయకరావుపేట : స్థానిక ఐటీఐలో ఈ నెల 19న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మాన్ సివిల్ ట్రేడు ల్లో పాసైన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొనాలని సూచించారు. జె.వై.సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, హావెల్ బేల్లోస్ (దువ్వాడ, విశాఖపట్నం), ఆర్‌హెచ్ఐ మాగ్నెసిటా (పరవాడ), కియా మోటార్స్ తదితర సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 19న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు రాక

మహారాణిపేట: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ ఈ నెల 19న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. ఇక్కడ నుంచి పాడేరు బయలుదేరుతారు. ఆదివాసీ ఉద్యోగ భవనంలో గిరిజనులతో సమావేశమవుతారు. 11 గంటలకు పాడేరు ఐటీడీఏ మీటింగ్ హాలులో కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో సమావేశం అవుతారు. 2 గంటలకు అరకు చేరుకుని అక్కడ పలు ప్రాంతాలను సందర్శిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఏపీ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో హరిత హోటల్‌లో సమావేశమవుతారు. రాత్రికి విశాఖ చేరుకుని బస చేస్తారు. 20న ఉదయం 11 గంటలకు విశాఖ పోర్టు ట్రస్ట్‌లో ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్, మధ్యాహ్నం 2 గంటలకు స్టీల్‌ప్లాంట్ ఎస్టీ ఉద్యోగులు అసోసియేషన్, సాయంత్రం 5 గంటలకు గిరిజన నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. రాత్రి 8.45 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళ్తారు.

### పాఠశాల ఫ్లోరింగ్ పనులకు సహకారం



పాఠశాలలో పాడైన ఫ్లోరింగ్‌ను పరిశీలిస్తున్న జమాల్‌ఖాన్

ఎటపాక: మండలంలోని ఫెర్గూసన్‌పేట ప్రభుత్వ పాఠశాలలో పగిలిన ఫ్లోరింగ్ మరమ్మతు పనులు చేయించేందుకు ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ ముందుకొచ్చారు. విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ఆయన సాయం కోరడంతో మంగళవారం పాఠశాలను సందర్శించారు. అక్కడ పాడైన ఫ్లోరింగ్‌ను ఆయన పరిశీలించారు. చిన్నారులు నేలపై కూర్చుని చదువుకునేందుకు ఇబ్బందులు పడుతుండడంతో జేకే సిటీ ట్రస్ట్ నిధులతో మరమ్మతు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. షాజహాన్, జావెద్, రియాజ్, ఇంతియజ్, నటరాజ్ ఉన్నారు.